# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

## తేదీ: 19-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ముగించుకొని ఈరోజు భారత్ చేరుకున్నారు.
- ❖ ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య దాడులు తీవ్రతరమవుతున్నాయి.
- ❖ ఆపరేషన్ సింధు పేరిట ఇరాన్ లో చిక్కుకున్న దేశ పౌరులను భారత్ స్వదేశానికి రప్పిస్తోంది.
- ❖ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల పర్యటన ముగించుకొని ఈరోజు భారత్ చేరుకున్నారు. అంతకుముందు ఈ పర్యటనలో భాగంగా మొట్ట మొదటి సారిగా క్రొయేషియాలో పర్యటించి ఆ దేశ ప్రధానమంత్రి ఆండ్రేజ్ ప్లెన్‌కోవిక్‌తో విస్తృత శ్రేణి ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. గత కొంత కాలంగా జాప్యమవుతున్న భారత్ యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై కూడా ఈ సందర్భంగా చర్చించారు. ఈ ఒప్పందానికి క్రొయేషియా మరోసారి తన మద్దతును పునరుద్ఘాటించింది. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మొదలగు అంశాలపై ఇరు దేశాల మధ్య పలు అవగాహనా ఒప్పందాలు కుదిరాయి.

========================

ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య దాడులు తీవ్రతరమవుతున్నాయి. ఈరోజు తెల్లవారుజామున దక్షిణ ఇజ్రాయెల్‌లోని సోరోకా ఆసుపత్రిపై ఇరాన్ క్షిపణి దాడి చేసింది. పౌర, వైద్య సౌకర్యాలను లక్ష్యంగా చేసుకోవడంతో ఇరు దేశాల మధ్య వివాదం మరింత తీవ్రరూపం దాల్చింది. అంతకముందు అణ్వాయుధాలను అభివృద్ధి చేయడానికి ఉపయోగించే భాగాలు, పరికరాలను కలిగి ఉందనే కారణంతో ఇరాన్ లోని నటాంజ్ అణు స్థావరంపై ఇజ్రాయెల్

సైన్యం నిన్న రాత్రి దాడులు చేసింది. ఇజ్రాయెల్ చేసిన దాడికి ప్రతిగా ఇరాన్ ఈరోజు ఈ క్షిపణి దాడులు చేసింది. ఇదిలా ఉండగా భారత రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ అమీర్ బరామ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితిపై ఇరువురు ఈ సందర్భంగా చర్చించారు.

========================

ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఇరాన్ లో ఉన్న భారత పౌరులను స్వదేశానికి రప్పించేందుకు ప్రభుత్వం ఆపరేషన్ సింధును ప్రారంభించింది. అందులో భాగంగా ఆర్మేనియా, తుర్క్ మెనిస్తాన్ వంటి దేశాలకు ముందుగా ఇరాన్ లోని భారతీయులను సురక్షితంగా తరలించి అక్కడి నుంచి భారత్ కు రప్పిస్తోంది. నిన్న ఉత్తర ఇరాన్ నుండి ఆర్మేనియాకు తరలించబడిన 110 మంది భారతీయ విద్యార్థులతో కూడిన విమానం ఈరోజు తెల్లవారుజామున న్యూఢిల్లీ చేరుకుంది. ఢిల్లీ విమానాశ్రయంలో భారత పౌరులకు విదేశీ వ్యవహారాల శాఖా సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఇప్పటివరకూ ఇరాన్‌లోని భారతీయ పౌరుల నుండి ప్రభుత్వానికి 350కి పైగా అభ్యర్థనలు వచ్చాయన్నారు. మరికొంత మంది భారతీయులతో వస్తున్న విమానం ఈరోజు రాత్రికి న్యూఢిల్లీ చేరుకుటుందని కీర్తి వర్ధన్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

గిరిజనులపై అత్యంత ప్రభావం చూపుతున్న సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నివారించే ఔషధం అభివృద్ధి కోసం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఎయిమ్స్ ఢిల్లీ సహకారంతో ఒక పోటీని నిర్వహిస్తోంది. ఈ పోటీలో ఎంపిక చేసిన ప్రతిపాదనకు 10 కోట్ల రూపాయల వరకు నిధులు సమకూరుతాయి. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా నివారణ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఢిల్లీలోని ఎయిమ్స్ లో జరిగిన సమావేశంలో గిరిజన వ్యవహారాల సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే ఈ ప్రకటన చేశారు. 2047 చివరి నాటికి దేశం నుండి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించడానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. సికిల్ సెల్ అనీమియాను తొలగించడంలో నిధుల కొరత ఉండదని ఆయన స్పష్టం చేశారు.

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న రెండు రోజులు బీహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ముందుగా బీహార్ చేరుకొని రేపు మధ్యాహ్నం 12 గంటలకు సివాన్‌లో బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. తరువాత, సాయంత్రం 4 గంటల 15 నిమిషాలకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు విశాఖ నగరానికి చేరుకుంటారు.

========================

భారతదేశానికి  చెందిన ఉన్నత విద్యా సంస్థలు QS వర్ల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (IIT) ఢిల్లీ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థల ర్యాంకింగ్‌ల తాజా ఎడిషన్‌లో IIT ఢిల్లీ గ్లోబల్ ర్యాంకింగ్ 150 నుండి 123కి చేరింది. ఇప్పటివరకు అత్యధిక QS వర్ల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్ సాధించడంలో IIT ఢిల్లీ తొలి స్థానంలో నిలిచింది.

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్  కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

=========================

భాషా అడ్డంకులను తొలగించే AI ఆధారిత మాధ్యమం బాషిణితో కేంద్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖలు అవగాహన ఒప్పందాలు చేసుకున్నాయి. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఈ ఎంఓయూ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ... ఈ ఒప్పందం  పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖకు సంబంధించిన కీలక పోర్టల్స్ వేదికల్లో భాషా ప్రాప్యతను పెంచుతుందన్నారు. దేశవ్యాప్తంగా రాష్ట్రాల మధ్య చేరికను ఇది మరింత ప్రోత్సహిస్తుందన్నారు. పంచాయతీరాజ్ సంస్థలను క్షేత్ర స్థాయిలో భాగస్వామ్యం చేయడానికి AI - ఆధారిత పబ్లిక్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ను ప్రోత్సహించడం ఈ అవగాహన ఒప్పందం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

=========================

భారత్ - ఇంగ్లాండ్ జట్ల మధ్య 5 మ్యాచ్ ల క్రికెట్ టెస్ట్ సిరీస్ రేపటి నుండి ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్ లోని లీడ్స్ వేదికగా రేపు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు తొలి టెస్ట్ మ్యాచ్ ప్రారంభమవుతుంది. విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ వంటి దిగ్గజ ఆటగాళ్లు ఇటీవల టెస్ట్ ఫార్మాట్ కు వీడ్కోలు పలకడంతో శుభ్‌మన్ గిల్ సారధ్యంలోని భారత యువ జట్టు ఈ సిరీస్ కు సిద్ధమవుతోంది. మరోవైపు 2025-2027 వల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ సైకిల్ ను ఈ సిరీస్ తో ఇరు జట్లు ప్రారంభించనున్నాయి.

=========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం  81 వేల 444 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై... చివరికి 83 పాయింట్ల నష్టంతో 81 వేల 361 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18.80 పాయింట్ల నష్టంతో 24 వేల 793 వద్ద ముగిసింది.

=========================
=========================